క్లుప్తంగా

నేడు ఉరుసు ఉత్సవం

చిట్వేలి : మత సామరస్యానికి ప్రతీకగా, భక్తుల కోర్కెలు తీరుస్తూ పిలిచిన వెంటనే పలికే దైవంగా పూజలందుకుంటున్న బురాన్ షావలీ దర్గా ఉరుసు ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ముస్లిం మత పెద్దలు శనివారం తెలియజేశారు. 450 సంవత్సరాల చరిత్ర కల్గిన దర్గా ఉరుసులో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని మత పెద్దలు కోరారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

వీరబల్లి : మండల కేంద్రంలోని కొత్తపేట వీధిలోని ఎంఆర్‌సీ భవనం పక్కన ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి వీరనాగిరెడ్డి పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పిల్లలకు అందాల్సిన పాలు, గుడ్లు, పిండి ఇతర పోషక పదార్థాలు సకాలంలో అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు.

డీలర్‌ను తిట్టాడంటూ కేసు నమోదు

వీరబల్లి : మండలంలోని పెద్దవీటి పంచాయతీ గ్రంధివాళ్లపల్లెకు చెందిన ముక్కంటి జగదీష్‌కు ఇటీవల జరిగిన రేషన్ డీలర్ల నియామకంలో రేషన్ షాపు వచ్చింది. ఇతనిని అదే పంచాయతీలోని కొత్తపల్లికి చెందిన వెంకటసుబ్బారెడ్డి తిట్టాడంటూ డీలర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ మోహన్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కంటి వైద్య శిబిరం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోనిశెట్టిగుంట ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం కంటి వైద్య నిపుణులు పులిచెర్ల ఓబులేసు ఆధ్వర్యంలో జ్యోతికాలనీ వాసులకు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 50 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

బహుమతుల ప్రదానం

పుల్లంపేట : మండలంలోని అనంతయ్యగారిపల్లిలో శనివారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కుమార్ రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించారు. మొత్తం 22 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో అనంతయ్యగారిపల్లి జట్టు, కుంపిణీ పురం జట్లు తలపడ్డాయి. విజతగా అనంతయ్యగారిపల్లి జట్టు నిలువగా రూ.30 వేలు, రన్నర్‌గా నిలిచిన కుంపిణీపురం జట్టుకు రూ.15 వేలు నగదును విజయ్ కుమార్ రెడ్డి చేతులమీదుగా అందించడం జరిగింది.

సేవా కార్యక్రమాల్లో ముందుంటాం

ఒంటిమిట్ట : పేదలకు సేవా కార్యక్రమాలు అందించడంలో తామెప్పుడూ ముందుంటామని జామియా నూరుల్లా ఇస్లామిక్ ట్రస్టు అధినేత క్వారీ అబ్దుల్ సుభాన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రాచపల్లి గ్రామంలోని జామియా నూరుల్లా ఇస్లామిక్ ట్రస్టు మొదటి మదరసాలో పలు సమస్యలతో బాధపడుతున్న మౌజమ్‌లు, ఇమామ్‌లు, నిరుపేదలకు కులమతాలకు అతీతంగా ఆర్థిక సాయం అందించారు. దాదాపు 200 మంది నిరుపేదలకు సాయం అందించినట్టు ట్రస్టు సభ్యులు తెలియజేశారు.

కాటిదేవుడి స్థలాన్ని కాపాడండి

ఓబులవారిపల్లె : కాటిదేవుడు స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని చెన్నరాజుపోడు గ్రామస్తులు శనివారం తహసీల్దార్ శ్రీధర్ రావుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా సంక్రాంతి పండుగరోజు కాటిదేవుడి స్థలంలో గ్రామస్తులు పశువులను పూజించుకోవడం ఆచారంగా కొనసాగుతోందని, సంబంధిత స్థలాన్ని రెవెన్యూ అధికారులు ఇంటి స్థలాల కోసం గ్రామస్తులకు పట్టాలు ఇచ్చారన్నారు. వాటిని వెంటనే రద్దు చేసి పనులను నిలిపివేసి వారికి మరోచోట భూమిని కేటాయించాలని తహసీల్దార్ శ్రీధర్ రావును గ్రామస్తులు కోరారు.

‘విధాన్ సే సమాధాన్’

రైల్వేకోడూరు అర్బన్ : మహిళలకు చట్టాలపై అవగాహన ఉండటం చాలా ముఖ్యమని జూనియర్ సివిల్ జడ్జి తేజసాయి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సభా భవనంలో విధాన్ సే సమాధాన్ సదస్సును నిర్వహించారు. పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ మహిళలను జాగృతిని చేసేందుకు ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. సమాజంలో జరుగుతున్న సంఘటనల నుంచి తామని తాము రక్షించుకునేందుకు చట్టాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాది వెంకటరామరాజు, ఎంపీడీఓ నాగార్జున పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

సుండుపల్లె : పెద్దినేని కాలువ పంచాయతీ చెరుకువాండ్లపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు తన సిబ్బందితో కలసి పేకాట స్థావరంపై దాడి చేసి జూదమాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.51,060ల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

బావిలో పడిన ఆవు

సిద్దవటం : మండలంలోని గాంధీవీధికి చెందిన భవనాశి కాటయ్య ఆవు శుక్రవారం రాత్రి ఆకులవీధిలోని వ్యవసాయ పొలాల్లోని బావిలో పడింది. ఆవు యజమాని కాటయ్య ఆవు ఇంటికి రాలేదని శుక్రవారం గ్రామంతోపాటు చుట్టుపక్క ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. ఆకులవీధి గ్రామస్తులు తమ గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో ఆవుపడిందని శనివారం అతనికి సమాచారం ఇచ్చారు. స్థానికుల సహకారంతో ఆవును బయటకు తీసే ప్రయత్నం చేశారు. ఫలించకపోవడంతో పోలీసులు, ఇన్‌చార్జి తహసీల్దారుకు సమాచారం ఇచ్చి ఆవును సురక్షితంగా బయటకు తీశారు.

విస్తరణకు..‘కూటమి’ వెనకడుగు!

- అవస్థలు గురిచేస్తున్న రాజంపేట ఇరుకు రోడ్లు
- రోడ్ల వెడల్పు జరగకుంటే తిప్పలే
- ఆక్రమణలతో ట్రాఫిక్ మరింత జఠిలం
- శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి



విస్తరణకు నోచుకోని రాజంపేట ప్రధాన రహదారి



పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న ప్రధాన మలుపు

రాజంపేట : పార్లమెంట నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో రోడ్లన్నీ ఇరుకుగా మారిపోయాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదేపదే రోడ్ల అభివృద్ధికి ఊకదంపుడు ప్రకటనలు చేస్తున్న తరుణంలో రాజంపేట రోడ్ల విస్తరణకు కూటమి ప్రభుత్వం వెనుకాడుతోందని సమాచారం. పట్టణంలో విస్తరణ లేకుండానే ట్రాఫిక్ సమస్య పరిష్కారం సాధ్యమా అనే అంశం చర్చనీయాశంగా మారింది. రాజంపేట ప్రధాన రహదారి, ఆర్‌ఎస్ రోడ్డు, తిరుపతి రోడ్డు, నెల్లూరు రోడ్డు విస్తరణతో ట్రాఫిక్‌కు చెక్ పెట్టవచ్చునని పట్టణ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. ఇది కూటమి ప్రభుత్వానికి ఇది ఒక సవాల్‌గా మారనున్నది. ఈ రోడ్లలో దుకాణాలు ముందుకురావడంతోపాటు రోడ్డు విస్తరణ జరగకపోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలంగా తయారైంది.

ఆ నాలుగు డిపార్టుమెంట్స్ ఏకమైతేనే..

చిరకాలంగా రాజంపేట ట్రాఫిక్ క్రమబద్ధీకరణ గాడిలో పడటంలేదు. సబ్‌కలెక్టర్, ఏఎస్పీ, కమిషనరు, ఆర్అండ్‌బీ ఈఈలు బృందంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే తప్ప ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని పట్టణ వాసులు అంటున్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఆదేశాల వస్తే తప్ప అధికారులలో చలనం వచ్చేలా పరిస్థితి కనిపించడంలేదు.

విస్తరణ జోలికివెళ్లాలంటనే..

పట్టణంలో పదేళ్లకుపైగా విస్తరణ అంశం అటకెక్కింది. పట్టణంలోని మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న సమయంలో అనుకోని ప్రమాద ఘటన జరిగింది. ఈ ఘటనలో ప్రమాదవశాత్తు ఓ ఇల్లు కూలి ఐదుగురు మృత్యువాత చెందారు. అప్పటి నుంచి పట్టణంలో విస్తరణ పనులు చేపట్టాలంటేనే అధికారులు, పాలకులు జంకుతున్నారు. ఆ ఘటన కారణంగా అనేకమంది అధికారులు, పాలకులు ఇబ్బందులు పడ్డారు.

విస్తరణ మార్కింగ్ వృథానే

రాజంపేట పట్టణంలో పాతబస్టాండు నుంచి మన్నూరు వరకు విస్తరణ జరిపి ముందుకొచ్చిన కట్టడాలకు మార్కింగ్ కూడా ఇచ్చారు. మన్నూరు నుంచి పోస్టాఫీసు వరకు విస్తరణ చేసి సిమెంటు రోడ్డు వేశారు. అక్కడి నుంచి సిమెంటురోడ్డు వేయడానికి అధికారులు, పాలకులు వెనకాడుతున్నారు. విస్తరణ చేస్తే మిగిలిన రోడ్డు వేయగలిగిన పరిస్థితులు నెలకొన్నాయి.

మలుపులు తొలిగింపు ఎప్పుడో..

పట్టణంలో ప్రధానరహదారిలో ఉన్న మలుపు మున్సిపాలిటీ క్లాంపెక్స్ వద్ద ఉంది. ఈ క్లాంపెక్స్‌లో మలుపు తొలిగించాలంటే విస్తరణ సందర్భంగా మార్కింగ్ మేరకు కట్టడాలను తొలిగిస్తే మలుపు ఇబ్బందులు తొలిగిపోతాయనేది చాలకాలం నుంచి వస్తున్న మాట. ఈ మలుపు వద్ద ఎదురెదురుగా బస్సులు, వాహనాలు వస్తే ట్రాఫిక్ అటు పాత బస్టాండు, ఇటు పోస్టాఫీసు(ప్రధాన కార్యాలయం) వరకు నిలిచిపోవాల్సి వస్తోంది. పట్టణంలో బిజీగా వ్యాపారాలు, జన సమూహం అధికంగా ఉండే ఈ ప్రాంతంలోనే. అంతేగాకుండా బండ్రాళ్ల వీధి, మార్కెట్, జౌళీ బజారు. మున్సిపాలిటీ క్లాంపెక్స్ తదితర ప్రాంతంలో మెయిన్‌రోడ్డులోని మలుపు ప్రాంతానికి సమీపంలో ఉన్నాయి. మలుపు తొలిగింపు చేపడితే మన్నూరు నుంచి ఉన్నట్లు విశాలంగా ఉంటుందని అధికారులు, పట్టణవాసులు భావిస్తున్నారు. అయితే అది సాధ్యమేనా అన్న ప్రశ్న పట్టణవాసులు తొలిచివేస్తోంది.

రద్దీగా ఉన్న ప్రాంతాలు ఇవే..

పట్టణంలో ఆర్‌ఎస్‌రోడ్డు, పాతబస్టాండు, మార్కెట్ ఏరియా, మెయిన్‌రోడ్డు, ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాలు రద్దీగా ఉంటాయి. తోపుడు బండ్ల వ్యాపారులు, ఆటోలు, బస్సులు నిలుపుకునేందుకు నిర్దేశించిన ప్రదేశాలు ఏవీ లేకపోవడంతో ఇష్టానుసారంగా స్టాండ్స్‌గా మార్చుకుంటున్నారనేది అధికారుల భావన.

జోన్లు కనుమరుగు..

రద్దీ దృష్ట్యా గతంలో పట్టణంలో రెడ్, గ్రీన్, అంబర్ జోన్లుగా విభజించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కమిటీ సమావేశమై ఆ ప్రకారంగానే అమలు చేసేందుకు సమావేశాలు కూడా నిర్వహించారు. అలాగే ఆటోలు, ఆర్టీసీ బస్సులు స్టాపింగ్ అంశాలపై పలు నిర్ణయాలు తీసుకునేలా అడుగులు వేశారు. ఆ తర్వాత అధికారులు మారిపోయారు. ప్రభుత్వాలు మారిపోయాయి. ఇక అక్కడితో జోన్ల ప్రతిపాదన.. అమలుకు బ్రేక్‌పడింది.

క్షేత్రస్థాయి పరిశీలనతో సాధ్యసాధ్యాలు..

ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా క్షేత్రస్థాయిలో పరిశీలనతోనే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సాధ్యసాధ్యాలు వీలుపడతాయని పట్టణవాసులు అంటున్నారు. కడప మెయిన్‌రోడ్డు, చిట్వేలి రోడ్డు, తిరుపతి మెయిన్‌రోడ్డు, రైల్వేస్టేషన్‌రోడ్డు, రైల్వేస్టేషన్, తిరుపతి మెయిన్‌రోడ్డు, కడప మెయిన్‌రోడ్డు, ఆర్టీసీ బస్టాండు నుంచి మన్నూరు వరకు ట్రాఫిక్, స్టాపింగ్‌పై దృష్టి పెట్టాల్సి ఉంది. వాసవీ హోం నీడ్స్ నుంచి జీఎంసీ సర్కిల్, నూనివారిపల్లె రోడ్డు ప్రాంతంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణను దృష్టి పెట్టాల్సి ఉంటుంది. వీటిపై కూటమి సర్కారు పట్టించుకోవడంలేదన్న వాదన వినిపిస్తోంది. విస్తరణ చేసి ప్రధాన రహదారిని వెడల్పు చేసి, ఆక్రమణలను తొలిగిస్తే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పట్టణ మేధావులు, ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

రోడ్లు విశాలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి



రాజంపేట పట్టణంలో ప్రధాన సమస్య ట్రాఫిక్. దీని కోసం పట్టణంలో రోడ్లు విశాలంగా ఉండేలా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రోడ్లన్నీ ఇరుకుగా మారిపోయాయి. నిత్యం ట్రాఫిక్ సమస్య పీడిస్తోంది. ఇందుకు కారణంగా ప్రధానంగా విస్తరణ అనేది లేకపోవడమే. రోడ్ల విస్తరణతో ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం ఉంటుంది.

– దండు చంద్రలీల, మాజీ చైర్మన్, డీసీఎంఎస్, రాజంపేట

విస్తరణ లేకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కష్టమే



రాజంపేట పట్టణంలో ప్రధానంగా ఉండే రోడ్లను విస్తరణ లేకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అంటే కష్టమే. పండుగలు, ప్రత్యేక కార్యక్రమాలప్పుడు ఇక ట్రాఫిక్ గురించి చెప్పనక్కర్లేదు. జిల్లా స్థాయిలో రాజంపేట పట్టణం అభివృద్ధి జరగాలంటే ముందుగా రోడ్లను వెడల్పు చేయాలి. విస్తరణ అనేది కూటమి ప్రభుత్వానికి సవాల్ లాంటిదే.

– బిల్లా నరేష్, సాఫ్ట్‌వేర్, రాజంపేట

ఫిబ్రవరి 14లోపు ఇ–పంట నమోదు పూర్తి చేయాలి

సిద్దవటం : రబీలో సాగయ్యే పంటలకు ఫిబ్రవరి 14వ తేదీలోపు ఇ–పంట నమోదు తప్పనిసరిగా పూర్తి చేయాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో శనివారం రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి సమక్షంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ నాగరాజ మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో సాగు విస్తీర్ణం, వివిధ పంటల స్థితిగతులు, రకాలు, చీడ, పీడలు, సస్యరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు. రైతుల ఈకేవైసీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. పీఎం కిసాన్ సంబంధిత అంశాలపై దృష్టి సారించి అర్హత కలిగిన కుటుంబం లబ్ధి పొందేలా చూడాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణకు తోడ్పాటు నందించాలన్నారు. డ్రిప్ సౌకర్యం అవసరమైన రైతులకు సబ్సిడీపై అందించాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, రైతులకు అందుబాటులో ఉండి సకాలంలో అన్ని రకాల సేవలను అందించాలని సూచించామన్నారు. కార్యక్రమంలో మండలంలోని రైతుసేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా గణతంత్ర వేడుకలు జరుపుదాం



కలర్ పేపర్ ఉపయోగించి విద్యార్థులు తయారు చేసిన మూడు రంగుల జెండాలు, త్రివర్ణ టోపీలు

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రమణ ప్లాస్టిక్ రహిత గణతంత్ర దినోత్సవ వేడుకలకు పిలుపునిచ్చారు. విద్యార్థులు కలర్ పేపర్స్ ఉపయోగించి స్వయంగా మూడు రంగుల జెండాలు, పాకెట్ బ్యాడ్జీలు, తలకు త్రివర్ణ టోపీలు తయారు చేశారు. అలాగే అట్టముక్కలతో ఎర్రకోట నమూనా, భారతదేశ నమూనా, త్రివర్ణ పతాక పువ్వులు, గ్రీటింగ్స్ కార్డ్స్ ఎంతగానో ఆకర్షించాయి. అనంతరం ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న ప్లాస్టిక్ జెండాలు, బ్యాడ్జీలు వాడకుండా ఇలా పేపర్ ద్వార పిల్లలతో తయారు చేయిస్తే వారిలో సృజనాత్మకంగా ఆలోచించి నమూనాలు చేయగలరన్నారు. గణతంత్ర దినోత్సవంలో భాగంగా పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖనం, వివిధ ఆటల పోటీలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కాపాడితే ప్రోత్సాహకాలు

రాజంపేట : రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎవరైతే ప్రాణాలు కాపాడేందుకు సమాచారాన్ని పోలీసు, హాస్పిటల్‌కు తెలియజేస్తారో వారికి నగదు ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందజేస్తుందని రాజంపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం డిపో మేనేజరు గుండాల రమణయ్య అధ్యక్షతన రాజంపేట ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో డ్రైవర్లు, కార్మికులతో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుదూ ప్రాణాలు కాపాడిన వారికి రూ.5వేల బహుమతి ఉంటుందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి గంటలోపు సరైన చికిత్స అందించిన వారికి రూ.5వేలు నగదు బహుమతి ప్రభుత్వం ఇస్తుందన్నారు. హైవే డ్రైవింగ్ లైసెన్స్ కాలపరిమితి ముగిసిన వారు రెన్యువల్ తప్పనసరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు, ఎంవీఐ సిబ్బంది పాల్గొన్నారు.

నాగరాజు కుటుంబాన్ని ఆదుకుంటాం

వీరబల్లి : మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీలో సీటీకే హరిజనవాడలో పార్టీ కార్యకర్త ఆమూరి నాగరాజు అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు వీరనాగిరెడ్డిలు కలిసి నాగరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగరాజు పార్టీ కోసం కష్టపడి పని చేసేవారని, ఆ కుటుంబాన్ని పార్టీ తరపున ఆదుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించండి

సుండుపల్లె : డెంగ్యూ, మలేరియా వ్యాధులు రాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని జోనల్ అధికారి డాక్టర్ లక్ష్మణ్ నాయక్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు రాయవరం పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే తప్పనిసరిగా చేయాలని డాక్టర్లకు తెలియజేశారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలకు వ్యాధులు బారీన పడకుండా చూసే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

రాయచోటి టౌన్ : చట్టాలపై విద్యార్థులకు అవగాహన చాలా అవసరమని సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ప్రసన్న అన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి వారికి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో చిన్న పిల్లలపై అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయన్నారు. అలాంటి సమయంలో వెంటనే తల్లిదండ్రులకు కానీ పోలీసులకు కానీ తెలియజేయాలని చెప్పారు. ఆడుకొనే సమయంలో అయినా, ప్రయాణించే సమయంలో అయినా ఆడపిల్లలు చాలా హుందాతనంగా నడుచుకోవాలని న్యాయవాది నాగేశ్వరావు సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు టి.నాగరాజ, హరీష్, ప్రధానోపాధ్యాయురాలు షమీం అంజుమ పాల్గొన్నారు.

ఘనంగా గజ్జ పూజోత్సవం



గజ్జ పూజోత్సవంలో పాల్గొన్న రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజపురం కాప్పల్లిలో శనివారం రాత్రి గ్రామంలో మహిళలు గజ్జపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి హాజరయ్యారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి గజ్జపూజ మహోత్సవాన్ని ప్రారంభించారు. గ్రామ మహిళల భజన, కోలాట ప్రదర్శన అందరిని అలరించింది.

రాయచోటి అభివృద్ధిలో ‘గడికోట’ మార్క్



జిల్లా పోలీస్ కార్యాలయ భవనం



వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం ప్రారంభోత్సవంలో నాయకులు (ఫైల్)

- జిల్లా కేంద్రం దశను మార్చేందుకు శ్రీకాంత్‌రెడ్డి విశేష కృషి
- మున్సిపల్ ఛైర్మన్ చిల్లీస్ ఫయాస్‌బాషా

రాయచోటి అర్బన్ : కరువు ప్రాంతమైన రాయచోటిని జిల్లా కేంద్రంగా ప్రకటించడంతోపాటు జిల్లా కేంద్రం అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్‌రెడ్డి చేసిన కృషి ఎనలేనిదని రాయచోటి మున్సిపల్ ఛైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అన్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన అభివృద్ధిపై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. నేడు రాయచోటిలో గణతంత్ర దినోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయంటే అది శ్రీకాంత్‌రెడ్డి పట్టుదల వల్లనే సాధ్యమైందన్నారు. రాయచోటిని మండల స్థాయి నుంచి జిల్లా కేంద్రంగా మార్చడంలో ఆయన ఎంతో కృషి చేశారన్నారు. శ్రీకాంత్‌రెడ్డి కారణంగానే అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఏప్రిల్4, 2022న రాయచోటిని అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అంతటితో ఆగకుండా జిల్లా కేంద్రానికి అవసరమయ్యే అన్ని వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయించడం నుంచి పనులు పూర్తి చేయించడంలో ప్రత్యేక చొరవ చూపారన్నారు.

2019 – 2024 మధ్య జిల్లా కేంద్రంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమ వివరాలు

శ్రీకాంత్‌రెడ్డి కృషితో రాయచోటిలో జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంతోపాటు 95కు పైగా జిల్లా ప్రధాన కార్యాలయాలు ఏర్పాటయ్యాయన్నారు. జిల్లా కేంద్రం ఏర్పడిన తరువాత కేవలం నాలుగు మాసాలలోనే పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను అందంగా తీర్చిదిద్దేలా పని చేశారన్నారు. అలానే ఆర్టీసీ బస్టాండు విస్తరణ, రూ. 23కోట్లతో వంద పడకల ఆసుపత్రి, రూ. 1.33 కోట్లతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవనాలు, రూ. 2.30 కోట్ల నిధులతో టీటీడీ కల్యాణ మండపం, రూ. 1 కోటితో వైఎస్ఆర్ రైతుబజార్, ఎంపీడీఓ కార్యాలయ భవనం, స్టేట్ గెస్ట్‌హౌస్, రూ. 98 లక్షలతో డీఎస్పీ కార్యాలయం, పీహెచ్‌సీలు, రహదారులు, డైట్ హాస్టల్, పార్కు అభివృద్ధి, రింగ్ రోడ్డు తదితర పనులు చేపట్టి జిల్లా కేంద్రం అభివృద్ధికి బాటలు వేశారని ఫయాజ్ బాషా పేర్కొన్నారు.

అవినీతికి తావులేకుండా అభివృద్ధే ధ్యేయంగా



వందేళ్లకు కూడా రాయచోటి జిల్లా కేంద్రం అవుతుందో ? లేదో? అన్న పరిస్థితులున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చొరవతో జిల్లా కేంద్రం ఏర్పాటైందని ఆయన పేర్కొన్నారు. భూ అక్రమణలు, అవినీతి, రౌడీయిజానికి తావులేకుండా ప్రశాంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి సల్పారంటూ తెలియజేశారు. అభివృద్ధి అనేది రేపటి తరాల అవసరాలకు అనుగుణంగా పక్కా ప్రణాళికతో ముందుకు సాగారన్నారు.

మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాషా

ఆలయ అభివృద్ధికి విరాళం

సుండుపల్లె : ముడుంపాడు గ్రామం ఆరోగ్యపురంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శనివారం స్వామివారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా సుండుపల్లి నివాసులు పద్మావతి, నాగరాజ నాయక్ (టీచర్)లు ఆలయ అభివృద్ధికి రూ. 12116లు విరాళం అందించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

సిద్దవటం : సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, నిరుపేదల స్థలాలను కబ్జా చేసినా అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని ఒంటిమిట్ట సీఐ బాబు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఓపెన్ డ్రిక్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవించాలన్నారు. గొడవలకు ఆస్కారం ఇవ్వకూడదంటూ సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఐ శివప్రసాద్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

భారత రాజ్యాంగం మనకు కల్పించిన హక్కుల్లో ఓటు హక్కు అతి ముఖ్యమైందని అధికారులు అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని మండల కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని, ఓటు వేయడం బాధ్యతగా భావించి ప్రజా ప్రభుత్వం నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని తెలియజేశారు. అనంతరం అవగాహన ర్యాలీలు చేశారు. అలానే సీనియర్ సిటిజన్‌లను ఈ సందర్భంగా సత్కరించారు. – సాక్షి, నెట్‌వర్క్




చిట్వేలి: ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు



పెనగలూరు: ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



లక్కిరెడ్డిపల్లి: ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు



ఓబులవారిపల్లె: అవగాహన ర్యాలీలో తహసీల్దార్, టీచర్లు, విద్యార్థులు



సుండుపల్లె: పింఛా జెడ్పీహెచ్‌ఎస్‌లో..



వీరబల్లి: కళాశాల విద్యార్థులతో ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్



రాజంపేట: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి



రామాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్



సంబేపల్లె: మండల కేంద్రంలో..



గాలివీడు: ర్యాలీలో పాల్గొన్న అధికారులు